క్లుప్తంగా

అన్నపూర్ణదేవిగా చిన పోలమాంబ



విశేష అలంకరణలో అమ్మవారు

మద్దిలపాలెం: శివాజీపాలెం, పీతలవాని పాలెం గ్రామ దేవత చిన పోలమాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆరో రోజు శనివారం అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

చందనోత్సవంలో మృతులకు నివాళులు

మద్దిలపాలెం: సింహాచలం చందనోత్సవంలో గోడ కూలి దుర్మరణం పాలైన 15వ వార్డు పాత వెంకోజీపాలెం ఉమానగర్‌కు చెందిన గుజ్జారి మహాలక్ష్మి, పిల్లా ఉమామహేశ్వర రావు, పిల్లా శైలజ, పైలా వెంకటరత్నంలకు శనివారం పెద్ద కర్మ నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని మృతులకు నివాళులర్పించారు. వీరంతా అకాల మరణం పొందడం కుటుంబాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ 15వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

నేడు నరసింహ యజ్ఞం

తాటిచెట్లపాలెం: శ్రీ నరసింహ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సీతమ్మధార శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ యదురాజా దాస స్వామీజీ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు నరసింహ యజ్ఞం, 6.30 నుంచి 7 గంటల వరకు పూర్ణాహుతి, శాంతి వచనం, రాత్రి 7 నుంచి 7.30 గంటల వరకు నరసింహ లీలా ప్రవచనం, 7.30 నుంచి 8 గంటల వరకు మంగళ హారతి, సంకీర్తన, 8 గంటలకు తీర్థప్రసాద వితరణ జరుగుతాయని చెప్పారు.

ప్రయోజనకరంగా పరిశోధనలు



మణికంఠకు డాక్టరేట్ అందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: సమాజానికి మేలు చేసేలా పరిశోధనలతో ముందుకు సాగాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. సమాజా శాస్త్ర విభాగ పరిశోధకుడు కొణగల మణికంఠ డాక్టరేట్ పొందాడు. అర్థ శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ సూరె పుల్లారావు పర్యవేక్షణలో సమర్పించిన క్రాప్ డైవర్సిఫికేషన్ పరిశోధన గ్రంథానికి గాను డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా శనివారం వీసీ రాజశేఖర్ చేతుల మీదుగా మణికంఠ పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, పరిశోధకులు మణికంఠను అభినందించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మహిళలు

మద్దిలపాలెం: ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారాల్లో అధికంగా భక్తుల తాకిడి కనిపించడంతో స్వచ్ఛంద సంస్థలు ప్రసాదంతోపాటు మజ్జిగను పంపిణీ చేస్తున్నాయి. ఎండలో వచ్చే భక్తులు భగవంతుడి దర్శనం అనంతరం బయటకు వచ్చి ప్రసాదం తీసుకుని, మజ్జిగ తాగి వెళ్తున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ గోత్రనామాలతో పూజలు నిర్వహించి భగవంతుడిని తరింపజేస్తుంటే.. బయట ఆలయ కమిటీ కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావులు దాతలతో మజ్జిగను పంపిణీ చేయించి వేసవిలో భక్తుల దాహార్తిని తీరుస్తున్నారు.

తోటగరువు దరి బీఎస్ఆర్ నగర్ కొండవాలు ప్రాంతాన్ని సమస్యలు చుట్టిముట్టాయి. ఇక్కడ వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. వారికి కనీస అవసరాలు కూడా వారికి దూరమయ్యాయి. సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే లేడంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కొండ చుట్టూ ప్రదక్షిణ చేసే రాజకీయ నాయకులు గెలిచాక ముఖం చాటేస్తున్నారంటూ నిట్టూర్చుతున్నారు. – ఆరిలోవ



తోటగరువు దరి బీఎస్ఆర్ నగర్ కొండపై నివాసాలు

సమస్యల వలయంలో బీఎస్ఆర్ నగర్

- 2008లో భూ పోరాటం ఫలితంగా ఏర్పడిన కాలనీ
- కొండవాలుపై వెలసిన 700 నివాసాలు
- 17 ఏళ్లు గడిచినా కనీస సౌకర్యాలకు నోచుకోని వైనం
- ఇక్కడ తాగునీరు, వీధిలైట్ల వెలుగులు, సరైన రహదారులు లేవు
- ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న నివాసులు



విద్యుత్ లైటు వెలగని స్తంభం

జీవీఎంసీ 10వ వార్డులోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక కొండపై సీపీఎం చేపట్టిన భూ పోరాటం ద్వారా బీఎస్ఆర్ నగర్ ఏర్పడింది. ఇక్కడ నివసిస్తున్న వారంతా నిరుపేదలే. ఈ కొండపై సుమారు 700 నివాసాలున్నాయి. ఈ గ్రామం ఏర్పడి సుమారు 17 ఏళ్లయినా.. నేటికీ సమస్యల వలయంలోనే కొట్టుమిట్టాడుతోంది.

సీపీఎం భూ పోరాటం ద్వారా వెలసిన గ్రామం

తోటగరువు వద్ద ఉన్న కొండపై పేదలకు ఇళ్ల కోసం 2008 ఆగస్టు 23న నగరంలో సీపీఎం నాయకులు ఆరిలోవ జోన్ నాయకులతో కలసి భూ పోరాటం చేపట్టారు. ఆరిలోవలో సొంత ఇళ్లు లేని పేదలతోపాటు వెంకోజీపాలెం, ఇసుకతోట, మద్దిలపాలెం, మధురవాడ, ఎండాడ, సింహాచలం, అడవివరం, వేపగుంట, పెందుర్తి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పేదలు ఇక్కడ పాకలు వేశారు. రెవెన్యూ అధికారులు పలుసార్లు తొలగించినప్పటికీ సీపీఎం నాయకులు పట్టువీడకుండా విజయం సాధించి గూడు లేని పేదలకు నీడ కల్పించారు. ఈ కాలనీ ఏర్పడి సుమారు 17 ఏళ్లు గడిచినా ఇంతవరకు కనీస సౌకర్యాల కల్పనకు దూరం కావడం విశేషం.



పూడిక పేరుకుపోయిన కాలువ

ఇవీ సమస్యలు..

- బీఎస్ఆర్ నగర్ కొండపైన నివాసాలకు చేరేందుకు నిర్మించిన ఇరుకు మెట్ల మార్గాలు పలుచోట్ల శిథిలమయ్యాయి. ఆ మెట్లపై నడవడానికి స్థానికులు అవస్థలు పడుతున్నారు.
- ఇక్కడ ప్రధానంగా తాగునీటి సమస్య ప్రజలను ఏళ్ల తరబడి వేధిస్తోంది. కొండ దిగువన జీవీఎంసీ కుళాయిలు ఏర్పాటు చేసింది. రెండు చోట్ల తీయించిన బోర్లు పనిచేయడం లేదు.
- కొండ దిగువన రోడ్డును ఆనుకొని రెండు, మూడు వరుసల వారికి మాత్రమే కుళాయి నీరు అందుబాటులో ఉంటుంది. కొండపైన ఉన్న మిగిలిన కుటుంబాల వారు కుళాయి పాయింట్ల నుంచి సొంతంగా పైపులు ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా నీరు పైకి ఎక్కడం లేదు సరికదా.. స్థానికులు అమర్చుకున్న పైపులు ఇరుకు మెట్ల మార్గంలో వారు నడవడానికే ఆటంకంగా మారాయి.
- కొండపైన యూజీడీ సౌకర్యం లేదు. కొండ దిగువన విశాలమైన 20 నుంచి 30 అడుగుల వెడల్పు రోడ్డు ఉంది. దాని మధ్యలో యూజీడీ లైన్ ఇవ్వడానికి అవకాశమున్నప్పటికీ ఇంతవరకు జీవీఎంసీ అధికారులు అటుగా చూడలేదు. దీంతో నివాసులు సెప్టిక్ ట్యాంక్‌లు నిండగానే ప్రైవేట్ ట్యాంకర్లతో తోడించి తొలగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.
- కొండపైన ఎక్కువ శాతం వీధిలైట్లు కొన్ని నెలలుగా వెలగడం లేదు. కొండపై వారంతా రాత్రి వేళ చీకట్లలోనే గడుపుతున్నారు. అసలే కొండ, దానిపై నిత్యం విష సర్పాలు సంచరిస్తుండటంతో నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కొండవాలు కావడంతో ఇక్కడ ఇళ్ల మధ్య అన్నీ చిన్న కాలువలే ఉన్నాయి. వాటి నుంచి వాడుక నీరు కొండ దిగువన ప్రధాన కాలువలోకి చేరుతుంది. దానిలో కొన్నాళ్లుగా పూడిక పేరుకుపోవడంతో దోమలు, దుర్వాసనకు స్థానికులు గురవుతున్నారు.
- బీఎస్ఆర్ నగర్‌లోని చిన్న స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడన్నీ ఇరుకు రహదారులే. అవి కూడా పలు చోట్ల శిథిలమయ్యాయి.



కొండపై ఇళ్లకు శిథిలమైన ఇరుకు మెట్ల దారి



కొండపైన నివాసులు సొంతంగా అమర్చుకున్న కుళాయి పైపులు

మా కాలనీ సమస్యలు తీర్చాలి



మా కాలనీలో ఎన్నో సమస్యలున్నాయి. వాటితో మేమంతా ఇబ్బంది పడుతున్నాం. భూ పోరాటంలో నేను చిన్న పాక వేసుకున్నాను. అప్పటి నుంచి ఇక్కడే మా కుటుంబంతో కలిసి నివసిస్తున్నాను. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరుతున్నాం.

– డి.పాపారావు, స్థానికుడు

కనీస సౌకర్యాలు కల్పించాలి



ఇక్కడ సుమారు 700 నివాసాలున్నాయి. మా కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. కొండపై భాగంలో ఉన్నవారికి తాగునీటి సమస్య పూర్తిగా తీరలేదు. యూజీడీ సౌకర్యం లేకపోవడంతో సెప్టిక్ ట్యాంక్‌లు నిండి దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. వీధి లైట్లు వెలగడం లేదు. ఇక్కడి సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి.

– ఎస్.నగేష్, బీఎస్ఆర్ నగర్

నీరు లేక ఇబ్బంది పడుతున్నాం



మా ఇల్లు కొండపైన ఉంది. మాకు కుళాయి నీరు రావడం లేదు. ఇక్కడ రెండు చోట్ల ఏర్పాటు చేసిన చేతి బోర్లు పాడయ్యాయి. వాడుక, తాగు నీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు మా సమస్యలు పరిష్కరించాలి.

– బి.అప్పలనాయుడు, బీఎస్ఆర్ నగర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లికి వందనం'



ఆరిలోవ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాదాలను నీటితో కడుగుతున్న చిన్నారి



కేఆర్ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో పిల్లలు

ఆరిలోవ: అర్బన్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించినట్లు సూపర్‌వైజర్ సెల్వియా తెలిపారు. అర్బన్ సీడీపీవో ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. జీవీఎంసీ 9 నుంచి 13 వార్డుల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 12వ వార్డు ఆరిలోవ నెహ్రూనగర్‌లోని రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఉత్సాహంగా తల్లులకు పాదాభివందనం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో చిన్నారులు తమ తల్లుల కాళ్లు నీటితో కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: కేఆర్ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ ఆర్.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో తల్లికి వందనం నిర్వహించారు. తల్లులు, వారి సేవల గురించి చిన్నారులకు వివరించారు. తల్లిని గౌరవంగా చూసుకోవాలన్నారు. వారికి వృద్ధాప్యంలో పిల్లలుగా సేవలించడం చాలా అవసరమని సూచించారు. అనంతరం చిన్నారులు వారి తల్లుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

పిఠాపురం కాలనీ పార్క్‌పై హైకోర్టు స్టేటస్ కో

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ పార్క్‌లోని ఆట వస్తువులు, వేదికను జీవీఎంసీ తొలగించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కార్పొరేషన్ అధికారులు జిమ్, ఆట పరికరాలను దౌర్జన్యంగా తొలగించడంపై పిఠాపురం కాలనీ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించగా.. స్టేటస్ కో ఇచ్చింది. రాజకీయ ఒత్తిడి కారణంగా పార్క్‌లో దౌర్జన్యం చేసిన అధికారులు ఇప్పటికైనా ప్రజల వైపు ఉండాలని స్థానికులు హితవు పలికారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బుల్లయ్య కళాశాలలో సెమినార్

తాటిచెట్లపాలెం: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో పరిశోధన, అభివృద్ధి సెల్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ ఇన్నోవేటివ్ అండ్ స్టార్టప్ సెల్ సంయుక్తంగా శనివారం ఇంజినీరింగ్ అధ్యాపకుల కోసం ఒక రోజు సెమినార్ నిర్వహించారు. ఇంజినీరింగ్ జర్నల్స్‌లో ప్రచురణకు ప్రభావవంతమైన వ్యూహాలు అనే అంశంపై వీరికి అవగాహన కల్పించారు. ఎంటర్‌ప్రెన్యూర్ ఇన్నోవేటివ్ అండ్ స్టార్టప్ సెల్ కన్వీనర్ డాక్టర్ వంశీకృష్ణ, పరిశోధన, అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.వి.రమణారావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ జె.బాబులు మాట్లాడారు. సదస్సులో బులయ్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, సుమారు 100 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై నుంచి పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



సత్యనారాయణ(ఫైల్)

తగరపువలస: ఆనందపురం వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి ప్రమాదవశాత్తు ఫ్లైఓవర్‌పై నుంచి పడి మృతి చెందాడు. విశాఖ సత్యం జంక్షన్ క్రాంతి నగర్‌కు చెందిన నిద్దాన సత్యనారాయణ అనే వ్యక్తి మతిస్థిమితం లేకపోవడంతో శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గతంలో కూడా ఇలా వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడు, కానీ ఈసారి రాలేదు. అయితే శనివారం తెల్లవారుజామున ఆనందపురం దగ్గర వేములవలస పాత ఫ్లైఓవర్‌పై నుంచి సత్యనారాయణ పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారి సమాచారంతో కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు. కాగా ఇతని వద్దనున్న ఆధార్ ద్వారా చిరునామా తెలుసుకుని పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ప్రారంభం



ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

అల్లిపురం: పూర్ణా మార్కెట్ వద్ద ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను శనివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది 24 గంటలు పూర్ణా మార్కెట్ ప్రాంతంలో విధులు నిర్వహించేందుకు అనుకూలంగా ట్రాఫిక్ వలంటీర్ ఆలివ్ సతీష్ సహకారంతో ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సీపీ పూర్ణా మార్కెట్‌లో పర్యటించారు. అక్కడి వ్యాపారులు, వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీవీఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల ద్వారా ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ పార్కింగ్ చేసుకునేలా మార్కింగ్ చేయించి, బోర్డులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఏడీసీపీ కె.ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, ట్రాఫిక్ సీఐలు షణ్ముఖరావు, శ్రీనివాసరావు, వన్ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ జీడీ బాబు, ట్రాఫిక్ ఎస్ఐలు విశ్వనాథం, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రా.. డంపింగ్ యార్డా!

- ఎస్ఏజెహెచ్ – చెస్ట్ హాస్పిటల్ ఆవరణలో విచ్చలవిడిగా వ్యర్థాలు
- పరిపాలన, పరిశుభ్రతను గాలికొదిలేసిన సూపరింటెండెంట్

బీచ్‌రోడ్డు: నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(ఎన్ఏబీహెచ్) గుర్తింపు పొందిన పెదవాల్తేరులోని ప్రభుత్వ చెస్ట్ అండ్ సీడీ హాస్పిటల్ ఆవరణ డంపింగ్ యార్డును తలపిస్తోంది. దేశంలోనే ఎన్ఏబీహెచ్ గుర్తింపు దక్కించుకున్న తొలి ప్రభుత్వ ఆస్పత్రి ఇది. సూపరింటెండెంట్ నిర్లక్ష్యం వల్ల చెత్త కుప్పలకు నిలయంగా మారింది. ఎంతో ప్రమాదకరమైన బయో మెడికల్ వేస్ట్‌ను కూడా ఆస్పత్రి ఆవరణలోనే విచ్చలవిడిగా పడేస్తున్నారు. దీని వల్ల రోగులకు ఇతర వ్యాధులు వచ్చే అవకాశముంది. అంటువ్యాధులకు వైద్యం కూడా ఇక్కడే అందిస్తుంటారు. అటువంటి చికిత్సకు సంబంధించిన వ్యర్థాలను ఇక్కడ బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. ఆస్పత్రిలో పనికిరాని డోర్లు, కిటికీల చెత్తను కుడా ఇక్కడే పడేస్తున్నారు. చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ పరిపాలన, పరిశుభ్రతను గాలికొదిలేశారా అన్నట్లు.. ఆస్పత్రి పరిసరాలు తయారయ్యాయి. ఎన్ఏబీహెచ్ గౌరవం పొందిన ఛాతి ఆస్పత్రిలో పేషెంట్ సేఫ్టీ.. క్వాలిటీ ఆఫ్ కేర్ అంటే ఇదేనా అని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆస్పత్రిని సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.





ఆస్పత్రి ప్రాంగణంలో పడి ఉన్న తలుపులు, కిటికీల వ్యర్థాలు



పెదవాల్తేరులోని ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి ఆవరణలో పడేసిన బయో మెడికల్ వేస్ట్

మూసుకుపోయిన గెడ్డ



డెయిరీ ఫారం వద్ద పిచ్చి మొక్కలతో మూసుకుపోయిన గెడ్డ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీ ఫారం వద్ద గెడ్డ పిచ్చి మొక్కలతో మూసుకుపోయింది. జాతీయ రహదారిని ఆనుకొని సర్వీస్ రోడ్డులో డెయిరీ ఫారం పెట్రోల్ బంక్ నుంచి ఇందిరానగర్ వరకు ఉన్న ఈ గెడ్డలో కొన్నాళ్లుగా పూడిక తొలగించలేదు. దీంతో పేరుకుపోయిన పూడికపై పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. ఇవి మురుగు నీరు, వర్షం నీరు కిందకు ప్రవహించకుండా ఆటంకంగా మారాయి. దీంతో గెడ్డలో నిల్వ ఉన్న నీటి నుంచి దుర్వాసనతో స్థానికులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. గెడ్డలోని పూడిక, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించాలని జీవీఎంసీ శానిటరీ అధికారులను స్థానికులు కోరుతున్నారు.